చోరీలతో ప్రజల బెంబేలు

- తిరువూరు సర్కిల్‌లో పెరుగుతున్న నేరాలు
- అపరిచిత వ్యక్తుల సంచారంతో ఆందోళన
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తిరువూరు

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల తర్వాత తిరువూరు సర్కిల్‌లో నేరాలు పెరుగుతున్నాయి. ఇక్కడ జరుగుతున్న పలు అసాంఘిక కార్యకలాపాలు, జూదాలకు ఇతర ప్రాంతాల నుంచి నేర చరితులు వస్తుండటంతో నేరాలు పెరుగుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు. మహిళల మెడలో బంగారు నగల చోరీ, తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు, ద్విచక్ర వాహనాల చోరీ ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఉపాధి పనుల నిమిత్తం తిరువూరుకు వచ్చిన వారిలో కొందరు అపరిచిత వ్యక్తులు నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్

ఒంటరిగా ఉన్న మహిళల మెడలో బంగారు నగలు అపహరించే చైన్ స్నాచర్లు తిరువూరు ప్రాంతంలో హల్‌చల్ చేస్తున్నారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో ఇటీవల నాగార్జున సాగర్ కాలువ వద్ద పొలానికి వెళ్లే మహిళ మెడలో నగలు తస్కరించిన దుండగులు తదుపరి మైలవరం సర్కిల్‌లో కూడా ఇటువంటి నేరాలకు పాల్పడ్డారు. తిరువూరులో సైతం రద్దీ వేళల్లో హెల్మెట్ ధరించి ప్రధాన



తిరువూరులో జూదరులను అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

రహదారుల్లో ద్విచక్ర వాహనాలపై అపరిమిత వేగంతో సంచరిస్తున్నారని ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదని పలువురు వాపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

తిరువూరులో జరుగుతున్న పలు జూదాలలో పాల్గొనేందుకు పొరుగున ఉన్న జిల్లాల నుంచి జూదగాళ్లు పెద్ద ఎత్తున వస్తున్నారు. తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో పేకాట క్లబ్బులకు అనధికారిక అనుమతులు ఇవ్వడంతో నేరాలు ఇంకా పెరిగే అవకాశం ఉందని గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కోడిపందేలు, పేకాట వంటి జూదాలు పలు గ్రామాల్లో జోరుగా సాగుతున్నా పోలీసులు స్పందించడం లేదని వాపోతున్నారు. తిరువూరు పట్టణంలోని



చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకుల అరెస్టు చూపుతున్న తిరువూరు సీఐ గిరిబాబు (ఫైల్)

అన్ని రహదారులపై సీసీ కెమేరాలు ఉన్నప్పటికీ సక్రమంగా పనిచేయకపోవడంతో నేరగాళ్లను గుర్తించలేని పరిస్థితి నెలకొంది.

అనుమానం వస్తే సమాచారం ఇవ్వండి

మహిళల మెడలో గొలుసులు తస్కరించేందుకు యువకులు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయండి.

– గిరిబాబు, తిరువూరు సీఐ

యథేచ్ఛగా ఇసుక అక్రమ విక్రయాలు

- రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున తరలింపు
- ట్రాక్టర్ ఇసుక రూ. 2,500
- వెంచర్లు, ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాలకు తరలింపు

తిరువూరు: తిరువూరు మండలంలో అనుమతి లేకుండా ఇసుక తోలకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి స్థానిక వాగుల్లో ఇసుకను డోజర్లతో తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. కట్టలేరులో చిట్టేల వద్ద ఇటీవల వరదలకు మేట వేసిన ఇసుకను ట్రాక్టరు రూ.2,500 చొప్పున విక్రయిస్తున్నారు. తిరువూరు పట్టణంలోని రియల్ ఎస్టేట్ వెంచర్లతో పాటు ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాలకు కూడా కట్టలేరు ఇసుకను రాత్రి వేళల్లో పెద్దఎత్తున తరలిస్తున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రం హడావుడి చేసే రెవెన్యూ అధికారులు ఇటీవల రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వదిలేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

కట్టలేరులో నిత్యం 20కి పైగా ట్రాక్టర్లతో ఇసుక తరలించి విక్రయిస్తుండగా, అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక వ్యాపారాన్ని



తిరువూరు మండలం చిట్టేల కట్టలేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం అడ్డుకోలేకపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. సొంత అవసరాలకు ఇసుక తెచ్చుకునే వారిపై కేసులు నమోదు చేస్తున్న అధికారులు అక్రమంగా ఇసుక విక్రయించే వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

ఈ విషయమై తిరువూరు తహసీల్దార్ లక్ష్మీని వివరణ కోరగా, కట్టలేరులో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ ఇవ్వలేదన్నారు. అక్రమంగా తవ్వకాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వాగుపై వంతెన నిర్మించాలి

నారాయణ నగర్ వాసుల వినతి

మైలవరం: మైలవరం నారాయణ నగర్‌లోని వాగు వర్షాకాలంలో పొంగి ప్రవహిస్తూ సమీపంలోని పంట పొలాలు, మామిడి తోటలను ముంచెత్తుతోంది. వర్షాకాలంలో ఎ. కొండూరు మండలంలోని కొండల పైనుంచి ప్రవహించే కోతులు వాగు మైలవరం మీదుగా జి. కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు వాగులో కలుస్తోంది. మైలవరం నారాయణ నగర్‌లోని కోతులువాగుకు ఆవలి వైపున ఉన్న వ్యవసాయ భూములను మైలవరానికి చెందిన 30 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వాగు ఆవలివైపున మైలవరం వాసులకు చెందిన మామిడి తోటలు కూడా ఉన్నాయి. నిత్యం వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు ఈ వాగు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో వాగులో తూములతో తాత్కాలికంగా ఏర్పాటు



నారాయణనగర్‌లో దెబ్బతిన్న వాగుపై ఏర్పాటు చేసిన చప్టా

చేసిన చప్టా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రైతులు, వ్యవసాయ కూలీలు వాగు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలువురు ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతాన్ని సందర్శించి వాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కూడా వాగును సందర్శించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వాగుపై లో లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు, రైతు కూలీలు కోరుతున్నారు.

వాగుపై లో లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టాలి



మైలవరం నారాయణ నగర్‌లోని కోతుల వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలి. వాగు ఆవలి వైపున పంట పొలాలకు పనుల నిమిత్తం ప్రతి నిత్యం వెళుతుంటాము. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనితో మేము వెల్వడం వరకు వెళ్లి అక్కడి నుంచి పంట పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇది శ్రమతో కూడినందున ఇబ్బందులు పడుతున్నాం.

– టి. ఏసుబాబు, రైతు కూలీ మైలవరం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ

నూజివీడు: సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నూజివీడు రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ అన్నారు. వెంకటాద్రిపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలి, సైబర్‌నేరాలు ఎలా జరుగుతాయనే అంశాలపై వీడియోలు, ఫొటోలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ వివిధ రకాల యాప్‌ల ద్వారా, లింకుల ద్వారా డబ్బులు పొదుపు చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశ చూపి మోసం చేస్తారన్నారు. బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్లలో సంభాషిస్తూ వారి అక్కౌంట్ నంబర్, పిన్ నంబర్ చెప్పమని అడుగుతారని, ఇలాంటి వాటికి ఎవరూ స్పందించవద్దన్నారు. అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి ఇతర సంస్థలలో ప్రైజ్‌మనీ వచ్చిందని, దాని కొరకు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ రామకృష్ణ

ప్రభుత్వానికి ట్యాక్స్ కట్టాలంటూ మాయమాటలు చెప్పి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. సోషల్ మీడియా మాధ్యమాలలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచివి కావని చెప్పారు. ఈ విషయాలపై ఇంటి వద్ద మీ తల్లిదండ్రులను కూడా చైతన్యం చేయాలన్నారు. రూరల్ ఎస్ఐ లక్ష్మణబాబు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు అమలు చేయాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్

మైలవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. మైలవరం సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్ విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు ఉప్పు నరసింహారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ కార్మికుల భూ సమస్యలు పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ తో పాటు అనేక హామీలు ఇచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు అన్ని హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇచ్చి పేదలకు రూ.5 లక్షలతో గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బందిపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లకు గురిచేసి వారి ఉద్యోగ భద్రకు రక్షణ లేకుండా చేస్తున్నారని, ఈ విధమైన రాజకీయ జోక్యాన్ని ఆపాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

కె.తాడేపల్లిలో టీడీపీలోని ఇరువర్గాల కొట్లాట

వరద బాధితులకు కిట్ల పంపిణీలో వివాదం

విజయవాడరూరల్: వరద బాధితులకు ప్రభుత్వం అందజేసిన కిట్ల పంపిణీ విషయంలో టీడీపీకి చెందిన ఇరువర్గాల వారు దాడులకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. కొత్తూరు తాడేపల్లి టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు వరద బాధితులకు ఆదివారం కిట్లు పంపిణీ చేస్తుండగా మార్కాపురం రాములు అనే వ్యక్తి కిట్లు తీసుకునేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చాడు. ఎన్నిసార్లు కిట్లు తీసుకెళతావని చేబ్రోలు సాయి అనే వ్యక్తి అతనిని కాలుతో తన్నాడు. బాధితుడు రాములు తన వర్గీయులను తీసుకొచ్చి చేబ్రోలు సాయిపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై ఇరువర్గాల వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టీడీపీ కార్యాలయంలో రేషన్ కార్డులు పెట్టుకుని పంపిణీ

టీడీపీ పార్టీ కార్యాలయంలో రేషన్ కార్డులు పెట్టుకొని పార్టీ నాయకులు వరద బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్నారు. పార్టీ నాయకులకు అకూలమైన వారికి ఇళ్లకు కిట్లు పంపిస్తూ.. పేద, బీసీ వర్గాలకు చెందిన బాధితులకు పార్టీ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లమని హుకుం జారీ చేస్తున్నారని ఆ పార్టీకి చెందిన వారే ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన కిట్లను పార్టీ నాయకులు పంపిణీ చేయడం ఏమిటని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

75 మందికి వైద్య పరీక్షలు

నూజివీడు: పేదల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జయకిషన్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ జయకిషన్ చింతల అన్నారు. పట్టణంలోని వరద ముంపునకు గురైన కొప్పులవెలమ పేటలో ఆదివారం జయకిషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ముందులను అందజేశారు. పెద్దలకు, పిల్లలకు నీటి సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, పోషకాహార లోపాలను గుర్తించి తగిన చికిత్సను అందించడంతో పాటు మందులు అందజేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు జయకిషన్

30న ధర్నాను విజయవంతం చేయండి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికులు, వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 30న విజయవాడలో తలపెట్టిన ధర్నా విజయవంతాన్ని కోరుతూ కార్మిక సంఘాలతో ఇబ్రహీంపట్నంలో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల 30న నిర్వహిస్తున్న డిమాండ్స్ డే సందర్భంగా ధర్నా చేపట్టామన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, పనిగంటల కుదింపు, పని ప్రదేశాల్లో సమస్యల పరిష్కారం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లతో ధర్నా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ అచ్చమ్మ మృతి

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట తిరుపతిరావు మాతృమూర్తి తోట అచ్చమ్మ ఆదివారం మృతిచెందారు. అనారోగ్యంతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచారు. సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు చెప్పారు. అచ్చమ్మ మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

మైలవరం: మైలవరంలో వరదల నేపథ్యంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన అమిదేపురం దుర్గాప్రసాద్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సహాయం రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరుకు చెందిన గార్లపాటి రంగనాయకమ్మ (96) ఆదివారం మృతి చెందారు. ఆమె కంటి చూపు సక్రమంగా ఉంది. నేత్రదానం ఆవశ్యకతను స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు కుటుంబీకులకు వివరించారు. వారు అంగీకరించడంతో ఖమ్మం నేత్రనిధికి సమాచారం ఇవ్వగా వైద్యులు వచ్చి మృతురాలి కార్నియాలు సేకరించారు.

నేడు 'మీకోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే వాటిని పేర్కొన్న గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థులకు అభినందన



ఆదర్శ్‌కుమార్



సుమాంజలి



ఆశ్వర్య



ఆశిష్ కుమార్

ముసునూరు: తమ పాఠశాలలో విద్యనభ్యసించిన నలుగురు పూర్వ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయి ప్రవేశాల్లో సీట్లు సాధించడం అభినందనీయమని లోపూడి ఆశ్చర్య పాఠశాల కరస్పాండెంట్, ముసునూరు జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివి, కృష్ణా జిల్లా వేలేరు నవోదయలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు వరికూటి ఆదర్శ్‌కుమార్, కొండా సుమాంజలి ఇటీవల జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్-2024)లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి, తొలి జాబితాలోనే కాకినాడలోని ప్రఖ్యాత రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌కు ప్రవేశాలు పొందారన్నారు. వరికూటి ఆశ్చర్య జాతీయ స్థాయి అర్హత పరీక్షలో మెరిట్ ర్యాంకు సాధించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటగ్రేటెడ్ ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో ప్రవేశం పొందిందని చెప్పారు. మరో విద్యార్థి వరికూటి ఆశిష్‌కుమార్ నేషనల్ లెవెల్ శ్రేష్ఠ ప్రవేశ పరీక్షలో 73వ ర్యాంకుతో విశాఖపట్నంలోని అమేయ వరల్డ్ సీబీఎస్‌ఈ ఇంటర్నేషనల్ స్కూల్లో ప్రవేశం పొందినట్లు చెప్పారు. అత్యుత్తమ విజయాలు సాధించిన తమ పూర్వ విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు.

ప్రజా సమస్యలపై పోరాడిన ఏచూరి

మాజీ ఎంపీ పి. మధు

తిరువూరు: కమ్యూనిస్టు ఉద్యమాన్ని భారతదేశంలో పటిష్టపరచడంలో సీతారాం ఏచూరి చేసిన కృషి మరువలేనిదని సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ పి. మధు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. పేదల సమస్యల పరిష్కారానికి పార్లమెంటు వేదికగా పోరాడిన ఏచూరి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బు చుట్టూ తిరుగుతున్నాయని, ప్రజా సేవ కోసం కాదని అన్నారు. 12 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా సొంత ప్రయోజనాల కోసం కాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని కృషి చేశారన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో అఖిల పక్ష నాయకులు, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, తాళ్లూరి రామారావు, మాలపాటి ఉదయ్, చలమాల సత్యనారాయణ, గంజా కృష్ణమోహన్ పాల్గొన్నారు.



సంతాపసభలో మాట్లాడుతున్న మధు

పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు దగ్ధం



వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామం దళితవాడలోని అంగన్‌వాడీ స్కూల్ సమీపంలో కట్టిపోగు కుమారి ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపై ఆదివారం రాత్రి పిడుగు పడి కొబ్బరి చెట్టు కాలిపోయింది. ఇంటిలోని వారికి ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. నేటి రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే పిడుగు పడింది. భయంతో కాలనీ వాసులు ఆందోళన చెందారు.

హైస్కూల్‌ను అభివృద్ధి చేయాలని వినతి

తిరువూరు: తమ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఆదివారం గానుగపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు గ్రామస్తులు పలు సమస్యలు వివరించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయాలని, పాఠశాలలో సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయించాలని, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబుకే చెల్లు

- యువజన కాంగ్రెస్ నేత పవన్‌కుమార్ ధ్వజం

నూజివీడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలనపై ఎక్కడా లేని హడావుడి చేస్తోందని, ఏమీ చేయకపోయినా చేసినట్లు మభ్యపెట్టడం చంద్రబాబుకే చెల్లుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. సూపర్‌సిక్స్‌లో ఏది నెరవేర్చారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలను ప్రజలు నిలదీసే సమయం అతి దగ్గరలోనే ఉందన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన సీఎం చంద్రబాబు వంద రోజుల్లో రూ.20 వేల కోట్ల అప్పు చేశారని ధ్వజమెత్తారు. ఉచిత ఇసుక అని అన్నారు తప్పితే, మైసూర్ బోండాలో మైసూర్ లేనట్లుగా ఉచిత ఇసుకలో ఉచితం లేదని దుయ్యబట్టారు. టిప్పర్ ఇసుకను రూ.20 వేలు పెట్టి కొనాల్సి వస్తోందని విమర్శించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక భారంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ ఉందో, లేదో కూడా అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు వాస్తవాలను గ్రహిస్తూ చంద్రబాబు మోసాలను తెలుసుకుంటున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై కేంద్రం వడ్డీ లేని రుణం ఇస్తాననగానే యూ టర్న్ తీసుకున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని, మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తప్పకుండా బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

క్లుప్తంగా

వరద బాధితులకు వస్త్రాలు పంపిణీ



ఇబ్రహీంపట్నం: లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి, వీఆర్కే నగర్ మహిళా లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ సింగ్‌నగర్ వరద బాధితులకు ఆదివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. స్థానిక లహరి విద్యాపీఠంలో జరిగిన కార్యక్రమంలో గద్దే శేషగిరిరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు దేవినేని కిషోర్‌కుమార్, జోనీకుమారి, బాబు, నేపా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- ఇబ్రహీంపట్నం క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో 500 మందికి 25 కిలోల చొప్పున బియ్యం, నూతన వస్త్రాలు, రూ.500 నగదు అందజేశారు. చర్చి ఇవాంజిలిస్ట్ నల్లమోతు విజయారావు, సువర్ణప్రసాద్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరువూరు: స్థానిక శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నారాయణ సేవలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మ ప్రేమాశ్రమం, దివ్యాంగుల ఆశ్రమాల్లోని వృద్ధులు, దివ్యాంగులతో పాటు మొత్తం 53 మందికి కోకిలంపాడు రోడ్డులోని సత్యసాయి మందిరంలో అన్నదానం చేశారు. కన్వీనర్ దామెర ప్రభాకరరావు, భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే పోలీసుల పల్లె నిద్ర



ఆగిరిపల్లి: నేరాల నియంత్రణకు పోలీసులు పల్లె నిద్రలు చేస్తున్నారని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. శనివారం రాత్రి ఎస్ఐ శుభశేఖర్‌తో కలిసి నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ మండలంలోని వడ్లమానులో పల్లె నిద్ర చేశారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, డెబిట్ కార్డు నెంబర్లు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా పోలీసులకు సమాచారం అందిస్తేనే అక్రమ రవాణాను అరికట్టగలుగుతామని చెప్పారు. పోలీస్ సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూద శిబిరాలపై పోలీసుల దాడులు



తిరువూరు: తిరువూరు మండలంలో ఆదివారం జూద శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. కొత్త కోకిలంపాడులో కోడిపందేలు వేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి నిర్వహించగా రెండు కోళ్లు, 14 ద్విచక్ర వాహనాలు, రూ.18 వేల నగదు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు జూదరులపై కేసులు నమోదు చేశామని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. చిట్టేల గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరు జూదరులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.9,600 నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

వైభవంగా గణపతి నిమజ్జనం



మైలవరం: మైలవరం నూజివీడు రోడ్డులోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం ఆదివారం భక్తుల కోలాహలం, మేళ తాళాల మధ్య నిమజ్జనానికి తరలి వెళ్లింది. పూలతో అలంకరించిన ట్రాక్టర్‌పై గణపతి విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.